సాక్షి మెదక్

గురువారం । 15 । జూన్ । 2023



ముందస్తు వరిసాగే మేలు

యాసంగిలో వరిసాగుచేసే రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వరిసాగుకు సంబంధించి పంటకాలాన్ని ముందుకు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. 4లో

నేడు పల్లెప్రగతి దినోత్సవం

మెదక్ కలెక్టరేట్: అన్ని గ్రామపంచాయతీల్లో గురువారం పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ ముందు జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం పల్లె ప్రగతి ద్వారా గ్రామానికి వచ్చిన నిధుల వివరాలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలకు జరిగిన లబ్ధిని, గ్రామంలో నిర్మించిన మౌలిక వసతుల వివరాల ప్రగతిని వివరించాలన్నారు.

టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు 178మంది హాజరు కావాల్సి ఉండగా 140మంది హాజరయ్యారు. నర్సాపూర్, మెదక్‌లోని పలు పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించారు. ఎవరూ డీబార్ కాలేదని డీఈఓ రాధాకిషన్ తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ

రామాయంపేట(మెదక్): జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ చెప్పారు. రామాయంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పలు పరీక్షాకేంద్రాలను ఆయన సందర్శించారు. ఎలాంటి మాస్‌కాపీయింగ్ లేకుండా ప్రశాంతంగా పరీక్షలు కొనసాగుతున్నాయన్నారు. ఆయన వెంట పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు అశోక్, కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

177మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో 177మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బుధవారం ఉదయం జరిగిన ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 1202మంది హాజరుకావాల్సి ఉండగా 1156 మంది, మధ్యాహ్నం జరిగిన సెకండ్ ఇయర్ పరీక్షలకు 2814మందిగాను 2683మంది హాజరయ్యారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ముసాపేట గ్రామస్తులు

పెద్దశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దశంకరంపేట మండలం ముసాపేట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీలో చేరినవారిలో కేశవ్, చాకలి సంగయ్య, మల్లేషం, సాయిలు, సతీష్, సుభాష్‌లున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు యాదుల్‌హుస్సేన్, పీఏసీఎస్ డైరెక్టర్ శశింధర్‌రెడ్డి, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు అడివయ్య, వార్డు సభ్యులు రాజు, కొమురయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభినందన



ఎమ్మెల్యే క్రాంతికిరణ్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న వైద్యులు

టేక్మాల్(మెదక్): జాతీయఆరోగ్యమిషన్‌లో భాగంగా టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయస్థాయి బహుమతి వచ్చిన విషయం తెలిసిందే. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోగిపేటలోని ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ చేతుల మీదుగా డాక్టర్ షాలిని, డాక్టర్ కృతికలకు సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు.

అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయాలి



పాఠశాలను పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

చేగుంట(తూప్రాన్): చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈఓ రాధాకిషన్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని అసంపూర్తి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలను కల్పించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జిల్లాలో 313 పాఠశాలలు మన ఊరు–మనబడి కార్యక్రమంలో ఎంపిక కాగా 100 పాఠశాలల్లో వసతులు పూర్తి చేసినట్లు తెలిపారు. త్వరలోనే మిగతా అన్ని పాఠశాలల్లో వసతులను కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

ఎంపిక ఎలా?

- జీసీ కులవృత్తుల వారిలో టెన్షన్
- మీసేవ సెంటర్లలో దరఖాస్తులదారుల బారులు



మీసేవ సెంటర్ వద్ద బారులు తీరిన దరఖాస్తుదారులు

మెదక్ కలెక్టరేట్: ఆయా కులవృత్తుల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారా ? గ్రామం, మండలం, నియోజకవర్గం ఏది యూనిట్‌గా పరిగణనలో తీసుకుంటారు? ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారు? ఎంపికలో విధివిధానాలు ఏమిటి ? ఇప్పుడు అందరినీ తొలుస్తున్న ప్రశ్న ఇదే. బీసీ కులవృత్తుల వారికి ప్రభుత్వం అందించే రూ.లక్ష ఆర్థికసాయం కోసం దరఖాస్తుదారులు మీ సేవ సెంటర్లలో బారులుదీరుతున్నారు. ఈ నెల 9వ తేదీనే ప్రారంభం కావడం.. 20వ తేదీ వరకే గడువు ఉండడంతో అందరిలోనూ ఆందోళన నెలకొంది. బీసీల్లో కులవృత్తులవారీగా ఎవరెవరికి సాయం అందుతుందోనన్న చర్చ జరుగుతోంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే ముందుగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం. వీటికోసం మీసేవ సెంటర్లకు వచ్చేవారి సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. రోజుకు సగటున 100 మంది దాకా మీసేవ సెంటర్లకు వస్తున్నారు. 2021 తర్వాత తీసుకున్న కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉంటే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. అయినా ఈ విషయం ప్రజలకు తెలియక పోవడంతో కొత్తగా ఈ సర్టిఫికెట్లు పొందేందుకు మీసేవల వద్ద పడిగాపులు కాస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.లక్ష ఆర్థికసాయం పథకానికి 1493 దరఖాస్తులు వచ్చాయి.

ఇవీ నిబంధనలు:

- ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేవారు గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి పొంది ఉండకూడదు. అయితే ఇందులో కల్యాణలక్ష్మి పథకం కింద లబ్ధి పొందినవారిని మినహాయించారు.
- సంవత్సర ఆదాయం పట్టణప్రాంతాలవారు రూ. 2లక్షలు, గ్రామీణప్రాంతాలవారు అయితే రూ.1.50లక్షలలోపు ఉండాలి. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పథకం వర్తిస్తుంది.
- దరఖాస్తుదారుల వయస్సు 18 ఏళ్లు నిండి ఉండాలి. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్, మీసేవ ద్వారా పొందిన కులం, ఆదాయం సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక, ఆ ప్రింట్ కాపీ ఎవరికి ఇవ్వాల్సిన అవసరం లేదు. ఈ విషయాన్ని ఇటీవల కలెక్టర్ స్పష్టం చెప్పారు.

ఎవరెవరు అర్హులంటే...

నాయీబ్రాహ్మణ, రజక, ఉప్పరులు, కుమ్మరి, అవుసుల, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్ల, పూసల, మేదరి, వడ్డెర, ఆరే కటిక, దర్జీ, ఎంబీసీలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

అందరికీ వర్తింపజేయాలి



సీఎం కేసీఆర్ ప్రకటించిన లక్ష రూపాయల సాయం పథకం అందరికీ వర్తింపజేయాలి. ఈ పథకంలో పద్మశాలీలను చేర్చకపోవడం వల్ల మాకు అన్యాయం జరిగింది. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి పద్మశాలీలకు సైతం పథకం వర్తింపజేయాలి.

–అనిల్‌కుమార్ (పద్మశాలి), మెదక్

గడువు పొడిగించాలి



పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకుంటున్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రావడానికి వారం రోజుల సమయం పడుతుంది. మీసేవ సెంటర్ల వద్ద ప్రజలు పెద్దఎత్తున బారులు తీరుతున్నారు. ఆ దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ కావాలి. తహసీల్దార్ పరిశీలించేసరికి సమయం సరిపోతుందా..దరఖాస్తు చేసుకునే గడువు పొడగించాలి.

–రవి, మెదక్.



గవర్నర్ తమిళిసై నుంచి ప్రశంసపత్రం అందుకుంటున్న పాపారావు. చిత్రంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

గవర్నర్ ప్రశంస

రామాయంపేట, నర్సాపూర్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన ఇద్దరు గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా రాజ్‌భవన్‌లోని సంస్కృతి హాలులో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రశంసపత్రాలు అందుకున్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఏలేటి రాజశేఖర్‌రెడ్డితో నర్సాపూర్ బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న పాపారావులను గవర్నర్ సత్కరించారు. పాపారావు ఇప్పటికే 60సార్లు రక్తదానం చేసి రక్తదాతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నర్ నుంచి ప్రశంసపత్రం అందుకోవడం ఆనందంగా ఉందని, ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు.

సీఎస్ పర్యటన రద్దు

శివ్వంపేట(నర్సాపూర్): సీఎస్ శాంతకుమారి పర్యటన రద్దయ్యింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవంలో సీఎస్ పాల్గొనేందుకు మండల పరిధిలోని శభాష్‌పల్లికి గురువారం వస్తారని, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనివార్య కారణాల వల్ల పర్యటన రద్దయ్యింది. సీఎస్ వస్తున్నారని గ్రామాన్ని సుందరంగా అలంకరించడంతోపాటు ఏర్పాట్లు చేశామని సర్పంచ్ పార్వతిసత్యం అన్నారు. సీఎస్ వస్తే గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు వస్తాయని ఆశ పెట్టుకున్నామని ఆమె పర్యటన రద్దు నిరాశ మిగిల్చిందని సర్పంచ్ అన్నారు.

సీఎస్ వస్తున్నారని...

గాంధీవిగ్రహం పలు చోట్ల పాడైపోవడంతో సర్పంచ్ పార్వతిసత్యం కొత్త గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారు. వివిధ శాఖల సిబ్బంది గ్రామాన్ని సుందరంగా అలంకరించే పనులు చేపట్టారు. గ్రామంలో నిర్వహిస్తున్న పనులను జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ, డీపీఓ సాయిబాబా బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు సర్వే పూర్తి చేస్తాం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఓటరు నమోదు కోసం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని, ఈనెల 23 నాటికి సర్వే పూర్తవుతుందని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్ రమేశ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1.14 లక్షల గృహాలున్నాయన్నారు. 567 బూత్‌స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా నూతన ఓటరు నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, తొలగించిన ఓటరు పున:పరిశీలన, పొరపాటుగా జాబితా నుంచి తొలగిస్తే తిరిగి నమోదు, ఒకే ఇంట్లో ఆరుగురుకన్నా ఎక్కువగా ఉంటే పున:పరిశీలన, ఓటరు జాబితాలో మార్పులుచేర్పులు చేపడుతున్నామన్నారు. గురువారం ఎన్నికల అధికారులు, బూత్‌స్థాయి అధికారులతో ఎన్నికల నిర్వహణ కోసం సన్నద్ధంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ సాయిరాం, స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో బలాదూర్



అధికారులంతా ఫంక్షన్ వెళ్లడంతో ఓ గదికి తాళం ఇలా..

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపాలిటీ కార్యాయలంలో అంతా మా ఇష్టం అన్నట్టుగా ఉంది.బుధవారం మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు కొంతమంది పని వదిలేసి ఫంక్షన్ వెళ్లారు. దీంతో కార్యాలయం ఖాళీగా కనిపించింది. కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులో లేరు. ఫోన్‌లో వివరణ కోరగా స్పందించలేదు.

అనుమతులు లేని పాఠశాల సీజ్



పాఠశాలను సీజ్ చేస్తున్న కార్యాలయ సిబ్బంది

తూప్రాన్: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం తరగతులు ప్రారంభించడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుధవారం అడ్డుకుని ఎంఈఓ బుచ్చానాయక్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పాఠశాలకు చేరుకున్న ఎంఈఓ విద్యార్థులు, ఉపాధ్యాయులను బయటకు పంపించి పాఠశాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీన్, సంతోష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన నలంద జూనియర్ కళాశాల భవనంలో అక్షర ద ప్లానెట్ స్కూల్ ప్రారంభించి 300 మంది విద్యార్థులను చేర్చుకున్నారన్నారు. అనుమతులు లేకుండా పాఠశాల ప్రారంభించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం సరైంది కాదన్నారు. దీంతో అక్షర స్కూల్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, సంతోష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, జిల్లా కమిటీ సభ్యులు రాజేష్ పాల్గొన్నారు.

పూరిగుడిసె దగ్ధం

పేలిన సిలిండర్.. తప్పిన పెను ప్రమాదం



గుడిసెలో నుంచి మంటలు

మనోహరాబాద్(తూప్రాన్): ఓ పూరిగుడిసె దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన జల్లి పోచయ్య– లక్ష్మి దంపతులు పూరిగుడిసెలో ఉంటూ కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఇద్దరూ పనికివెళ్లగా వారి పిల్లలు బయట ఉన్నారు ఈ సమయంలో పూరిగుడిసెలోంచి మంటలు రావడాన్ని చుట్టుపక్కల వారు గమనించి ఆర్పే ప్రయత్నం చేశారు. ఈలోపు మంటలు భారీగా చేలరేగి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలి పోయింది. దీంతో పరిసర ప్రాంతాల వారు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వగా, నర్సాపూర్ నుంచి వచ్చిన ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలు ఆర్పేలోపు గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనలో గుడిసెలో దాచుకున్న రెండు లక్షల నగదు, 5 తులాల బంగారం, వెండి, టీవీ, దుస్తులు, 5 క్వింటాళ్ల బియ్యం పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యిందని బాధిత కుటుంబసభ్యులు వాపోయారు. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి సంఘటన స్థలానికి వచ్చి కేసు నమోదు చేశారు

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు శిక్షణ

మెదక్ కలెక్టరేట్: వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన అభ్యర్థులకు రెసిడెన్షియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి ఇంచార్జ్ అధికారి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఏఎస్ స్టడీసర్కిల్ ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 9 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థుల సంవత్సర ఆదాయం రూ.3లక్షలకు మించరాదన్నారు. పూర్తి సమాచారం కోసం 6281766534 నంబరులో పనివేళలో సంప్రదించాలన్నారు.

వైద్యసిబ్బంది సేవలు వెలకట్టలేనివి

- వైద్యారోగ్య దినోత్సవంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- గర్భిణులకు న్యూట్రీషన్ కిట్ల పంపిణీ



గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ రాజర్షిషా

మెదక్ మున్సిపాలిటీ: వైద్యసిబ్బంది సేవలు అనన్య సామాన్యం,.. వెలకట్టలేనివని మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మెదక్‌లోని మాయా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వైద్యారోగ్య దినోత్సవంలో కలెక్టర్ రాజర్షిషా, ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేసీఆర్ న్యూట్రీషన్ కిట్‌ను ప్రారంభించి 20 మంది గర్భిణులకు అందజేశారు. ఏఎన్‌ఎంలు క్షేత్రస్థాయిలో రోగుల బీపీని పరీక్షించేందుకు డిజిటల్ బీపీ మిషన్లు అందజేశారు. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖ సాధించిన ప్రగతిపై కరపత్రాలను ఆవిష్కరించగా, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ చందునాయక్ ప్రగతి నివేదిక చదివి వినిపించారు. అంతకుముందు ఎమ్మెల్యే మాతాశిశుసంరక్షణ కేంద్రాన్ని సందర్శించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యమిచ్చి వైద్యవిధానంలో మార్పులు తెచ్చిందన్నారు. నీతిఆయోగ్ విడుదల చేసిన హెల్త్ ఇండెక్స్‌లో తెలంగాణరాష్ట్రం ఓవరాల్ ర్యాంకింగ్‌లో 3వ స్థానంలో, వ్యాక్సినేషన్, ప్రసవాల పురోగతిలో టాప్‌లో ఉందన్నారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సీఎం కేసీఆర్ మంత్రి హరీశ్‌రావులు అహర్నిశలు శ్రమిస్తూ వైద్యరంగాన్ని బలోపేతం చేయడం వల్ల నేడు తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. జిల్లాలో త్వరలో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. బ్రిడ్జి కోర్సు పూర్తి చేసిన నలుగురు ఆయుష్ డాక్టర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వైద్యరంగంలో ఉత్తమ సేవలందించిన వైద్యులు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలకు జ్ఞాపిక, ప్రశంసపత్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ వైస్ చైర్‌పర్సన్ లావణ్య రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, డీఎంఅండ్‌హెచ్‌ఓ చందునాయక్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, శివదయాళ్, చంద్రశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు ప్రత్యేక గౌరవం



వైద్య దినోత్సవ వేదికపై నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

నర్సాపూర్: సమాజంలో వైద్యులకు ప్రత్యేక గౌరవం ఉంటుందని, సేవా భావంతో విధులు నిర్వర్తిస్తే మరింత గుర్తింపు వస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వసతులు కల్పించేందుకు సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటుండగా, ఆరోగ్య శాఖమంత్రి హరీశ్‌రావు వసతులు కల్పించి సేవలు ప్రజలు అందేవిధంగా కృషి చేస్తున్నారన్నారు. అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కాపాడేందుకు సీఎం కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ ప్రవేశ పెట్టారన్నారు. ప్రభుత్వ పథకాలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఆయా శాఖల సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా న్యూటీషన్ కిట్‌లను గర్భిణులకు అందజేశారు. వైద్యాఆరోగ్యశాఖ వాల్‌పోస్టర్‌ను సమావేశంలో ఆవిష్కరించారు. సమావేశానికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయనిర్మల అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. వేదికపై వైద్యులు ఎమ్మెల్యేకు బీపీ చెక్ చేశారు. ఉత్తమ సేవలందించిన పలువురు వైద్యులు, సిబ్బందికి ప్రశంసపత్రాలు, మెమొంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఎంపీపీ హరిక్రిష్ణ, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మిర్జానజీంబేగ్, ఇతర నాయకులు శేఖర్, భిక్షపతి, రమణగౌడ్, శివకుమార్, నగేష్, ఆంజనేయులుగౌడ్, రవినాయక్, దావుద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నేతలు, కార్మికులు

తూప్రాన్: మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలైన ఇస్కాన్, అక్షయపాత్రకు అప్పగించడాన్ని విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల మధ్యాహ్న భోజన కార్మికులను అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ బుధవారం కార్మికులతో కలసి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నాలుగైదు నెలలకు ఒకసారి ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుండటంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గతేడాది రూ.3వేల జీతాన్ని ఇస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. రెండు రోజుల క్రితం మధ్యాహ్న భోజన కార్మికులతో బలవంతపు సంతకాలు చేయించి తొలగించడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. మనోహరాబాద్ మండలంలోని తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు సుశీల, లక్ష్మి, కల్పన, నాగలక్ష్మి, ప్రమీల, రాజమణి, ఎల్లమ్మ, భారతి, నాగమణి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు దగ్ధం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నడుస్తున్న కారులో నుంచి మంటలు వచ్చి పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం ..లింగంపల్లికి చెందిన ఇండికా కారు యాజమాని తన కుటుంబ సభ్యులతో కలసి బుధవారం తెల్లా వారుజామున లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళుతున్నాడు. చౌరస్తా దాటిన తర్వాత కారులో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో వెంటనే కారులో నుంచి అందరూ కిందకు దిగారు. చూస్తుండగానే కారు పూర్తిగా దగ్ధమైంది. ఏ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

తాటిచెట్లు నరికిన వ్యక్తిపై కేసు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో తాటిచెట్లు నరికిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ఆర్లె వెంకన్న అనుమతి లేకుండా తాటిచెట్లు నరకడంతో గ్రామానికి చెందిన గౌడకులస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బైక్‌లో మంటలు.. ఆర్పిన స్థానికులు

చేగుంట(తూప్రాన్): బైక్‌లో మంటలు వస్తుండగా, గుర్తించిన స్థానికులు ఆర్పేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఓ యువకుడు బుధవారం బైక్‌పై గజ్వేల్ వైపునకు వెళుతున్నాడు. చేగుంట- గజ్వేల్ రోడ్డులోని ఆటో స్టాండ్ వద్దకు రాగానే బైక్ ఇంజన్‌లో మంటలు వచ్చాయి. దీంతో సదరు యువకుడు బైక్‌ను నిలిపి పక్కకు పరుగెత్తాడు. స్థానికులు ఇసుకతో పాటు నీళ్ల జల్లి మంటలు ఆర్పారు.

రేషన్‌బియ్యం పట్టివేత

చేగుంట(తూప్రాన్): అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్టు తహసీల్దార్ లక్ష్మణబాబు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు చేగుంట శివారులోని ఓ చికెన్ పరిశ్రమ వద్ద అక్రమంగా తరలిస్తున్న బియ్యం ఆటోను మంగళవారం రాత్రి పట్టుకున్నామన్నారు. 34 క్వింటాళ్ల 20 కేజీల బియ్యాన్ని గోదాంకు తరలించి ఆటోను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు. పట్టుబడింది పీడీఎస్ బియ్యంగా గుర్తించి సివిల్ సప్లయ్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

ఇద్దరి రిమాండ్

మిరుదొడ్డి(దుబ్బాక): ట్రాక్టర్ దహనం, మేక పోతును చంపిన కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు. మిరుదొడ్డి ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..ఆరు నెలల క్రితం మండల పరిధిలోని కాసులాబాద్‌కు చెందిన యాదగిరి ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కాగా ఇటీవల యాదగిరికి చెందిన మేక పోతుకు ఎవరో విష గుళికలు పెట్టారు. దీంతో మేక పోతు మృతి చెందింది. ట్రాక్టర్ దహనం, మేక మృతి చెందడంతో అనుమానం వ్యక్తం చేస్తూ కొందరిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అదే గ్రామానికి చెందిన పర్స ఆశయ్య, గోవిందారం బ్రహ్మంను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు తమ తప్పును ఒప్పుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వివాహిత ఆత్మహత్య

సంగారెడ్డి టౌన్: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. హత్నూర మండలానికి చెందిన అంజయ్య కూతురు లక్ష్మిని తాళ్లపల్లి గ్రామస్తుడు బాల్‌రాజ్ కి ఇచ్చి వివాహం చేశారు. భార్యాభర్తలు తరచూ గొడవపడుతున్నారు. ఈనెల 14వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మీ ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి అంజయ్య పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముందస్తు వరిసాగే మేలు

- పంటకాలం ముందుకు జరపాలన్న ప్రతిపాదనలు
- రోహిణి కార్తె నుంచి నార్లు పోసుకోవడం పాత పద్ధతే



సాక్షి, సంగారెడ్డి డెస్క్ :

యాసంగిలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగండ్ల వానల కారణంగా వరిపంటకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. ముఖ్యంగా మార్చి నుంచి మే నెల వరకు కురిసే వర్షాల కారణంగా ధాన్యం దిగుబడి బాగా తగ్గుతోంది. చేతికొచ్చే కొద్దిపాటి పంటలోనూ నాణ్యత లోపిస్తోంది. యాసంగిలో వరి సాగుచేసే రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వరిసాగుకు సంబంధించి పంటకాలాన్ని ముందుకు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో అకాల వర్షాల నుంచి రైతులు బయటపడొచ్చు. దీనిపై వ్యవసాయశాఖ, వ్యవసాయ శాస్త్రవేత్తలు కసరత్తు చేస్తున్నారు.

- సాధారణంగా అయితే వానాకాలం వరిసాగుకు సంబంధించి జూలైలో నార్లు పోసి ఆగస్టు వరకూ నాట్లు వేస్తారు.
- యాసంగిలో అయితే డిసెంబర్‌లో నార్లు పోసి జనవరి, ఫిబ్రవరి నెలల్లో నాట్లు వేస్తారు. యాసంగిలో సాగు చేసిన వరిపంట మే నెలలో కోతకు వస్తుంది.
- వానాకాలం సీజన్‌లో అయితే అక్టోబర్‌లో, యాసంగి సీజన్‌లో అయితే మార్చి రెండోవారం నుంచి ఏప్రిల్ నెల వరకు అకాలవర్షాలు కురుస్తాయి. దీంతో రైతులకు నష్టం జరుగుతోంది.
- ప్రకృతి వైపరీత్యాల బారిన రైతులు పడకుండా ఉండేందుకు, వరి పంటను కాపాడుకోవడానికి ఒకటే మార్గం ఉంది. అదే పంటసాగును ఒక నెలరోజులు ముందుకు జరపడమే.
- వానకాలంసాగుకు సంబంధించి జూన్‌లో నార్లు పోసుకొని జూలై నాటికి నాట్లు పూర్తి చేయాలి.
- యాసంగిలో అయితే నవంబర్‌లో నార్లు పోసి డిసెంబర్‌లో నాట్లు పూర్తి చేయాలి.
- వానాకాలంలో 140 రోజులు అంతకన్నా ఎక్కువ సమయం గల దీర్ఘకాలిక రకాల సాగుకు మే 25 నుంచి జూన్ 5లోగా నారు పోసుకోవాలి.
- 130 నుంచి 135 రోజుల వ్యవధిగల మధ్యకాలిక రకాల సాగులో జూన్ 15 వరకు నారు పోయాలి.
- 120 నుంచి 125 రోజుల వ్యవధి గల స్వల్పకాలిక రకాల సాగుకు జూన్ 25 వరకు నారు పోసుకోవాలి.
- సాగు చేసేది ఎలాంటి రకాలైనా సరే జూలై నెల వరకు వానాకాలంలో వరినాట్లు పూర్తికావాలి.
- వానాకాలం వరికోత అక్టోబర్ 3వ వారంనుంచి నవంబర్ మొదటివారం లోపు పూర్తి చేయాలి.
- యాసంగిలో నవంబర్ 20వ తేదీలోపు నారు పోసుకోవాలి.
- పంటకాలం ముందుకు జరిపితే వానాకాలం వరికోతలు నవంబర్ మొదటి వారంలోపు పూర్తవుతాయి. అయితే యాసంగి నారు కోసం ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది.
- రైతులు వానాకాలం సాగు సమయంలోనే ముందు జాగ్రత్తగా యాసంగి నారు కోసం ఒక చిన్న మడిని వదిలేసుకుంటే బాగుంటుంది. దీంతో వానాకాలం పంటలు కాస్త ఆలస్యమైనా వదిలేసిన మడిలో యాసంగి కోసం సరైన సమయంలో నారు పోసుకొనే వీలుంటుంది.

ఈ యాసంగిలో వరి సాగు ఇలా (ఎకరాల్లో)

సిదిపేట	3,40,000
మెదక్	2,60,000
సంగారెడ్డి	1,00,126

యాసంగిలో కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానల కారణంగా మెదక్ జిల్లాలో 32,884 ఎకరాల్లో, సిద్దిపేట జిల్లాలో 53 వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు. అయితే పూర్తిస్థాయిలో పంట నష్టం నమోదు ఎక్కడా జరగలేదని రైతులు, రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

నీటివసతి ఉంటేనే...

వానాకాలంలో వరిసాగును ముందుకు జరపాలంటే నీటివసతి తప్పనిసరి. బోరు,బావుల కింద సేద్యం చేసేచోట సాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఒకవేళ పంటసాగు కాలం ముందుకు జరిపినా ముందుగానే రైతులు బోరు,బావుల ద్వారా నార్లు పోసుకుంటారు. ప్రాజెక్టులు, కాల్వలు, లిఫ్ట్ ఇరిగేషన్, చెరువుల ద్వారా వరిసాగు చేసే చోటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతులు నార్లు పోసుకోవాలన్నా, వాటిని పెంచాలన్నా, ఆయా సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో సాగునీటి విడుదల తేదీలను కూడా ముందుకు జరపాలి.

ఇంకా చేయాల్సినవి...

- పంటకాలం ముందుకు జరిపే క్రమంలో రైతులకు సబ్సిడీపై అందజేసే విత్తనాలు కూడా ముందుగానే రైతులు చేరేలా చూడాలి.
- నార్లు పోసే నాటి నుంచి నాట్లు వేసే వరకు అవసరమైన ఎరువులు కూడా ముందుగా అందుబాటులో ఉంచాలి.
- రైతులకు పెట్టుబడి అవసరాలు ఉంటాయి. బ్యాంకుల నుంచి అందే కొత్త రుణాలు, రుణాల రెన్యూవల్, రైతుబంధు కింద ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం కూడా రైతులకు ముందస్తుగా అందాలి.



ముందు నారు పోస్తే పంటకు బలం



హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌కు చెందిన రైతు రాంగోపాల్‌రావు 15 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. గత ఏడాది వానాకాలంలో వరి సాగు చేయడంతో పాటు యాసంగి మిర్చి సాగు చేస్తే మంచి లాభాలు వచ్చాయి. ఈ వానాకాలం 15 ఎకరాల్లో వరిసాగు చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సందర్భంగా రాంగోపాల్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ పంటలు ప్రారంభానికి రోహిణి, ఆరుద్ర కార్తెలే అనుకూలం. ఈ రెండు కార్తెల్లో విత్తనం వేస్తే పంట బలంగా వస్తుంది. ఒకేసారి 15 ఎకరాల నాటు వేయాలంటే కూలీల కొరత ఉంది. అందుకే 15 రోజుల గడువు తీసుకొని మూడు దఫాలుగా నారు పోశాను.

వరి విత్తనరకాలు, పంటకాలం, నారుపోసే సమయం



వరిసాగుకు సంబంధించి పంటకాలాన్ని ముందుకు జరిపే క్రమంలో ఏఏ రకాల విత్తనాలతో నార్లు పోసుకోవచ్చని, వాటి పంట కాలం తదితర వివరాలను సిద్దిపేట జిల్లా తొర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీహెచ్.పల్లవి వివరించారు.

- **దీర్ఘకాలిక రకాలు:** పంటకాలం 140 రోజులపైనే. ఇందులో ప్రధానమైన వరి విత్తన రకాలు వరంగల్ 44 (సిద్ది), కంపాసాగర్ 2874, సాంబమసూరి. మే 25 నుంచి జూన్ 5వ తేదీ వరకు నార్లు పోసుకోవాలి
- **మధ్యకాలిక రకాలు:** పంటకాలం 135 రోజులు. ఇందులో ప్రధానమైన రకాలు రాజేంద్రనగర్ 2458 (కృష్ణ), వరంగల్ 32100 (వరంగల్ సన్నాలు), వరంగల్ 915, జగిత్యాల 384, పొలాస ప్రభ, జగిత్యాల 28545, జగిత్యాల 27356, వరంగల్ 1487 జూన్ 15వ తేదీ వరకు నార్లు పోసుకోవాలి
- **స్వల్పకాలిక రకాలు :** పటకాలం 120 నుంచి 125 రోజులు. ఇందులో ప్రధానమైనవి సన్న రకాలైన కునారం-1638, వరంగల్ 962, రాజేంద్రనగర్-21278, రాజేంద్రనగర్-15048 (తెలంగాణ సోనా), దొడ్డురకాల్లో కునారం-118 (కూనారం సన్నాలు), జగిత్యాల - 24423, జగిత్యాల - 18047 (బతుకమ్మ), రాజేంద్రనగర్-29325, మారుటేరు-1010 (కాటన్ దొర సన్నాలు).
- వానాకాలం వరిపంటకు జూన్ 25 లోపు నారు పోసుకుంటే...అక్టోబర్ మూడో వారం నుంచి నవంబరు మొదటి వారంలోపు కోతలు పూర్తి చేసుకోవచ్చు. ఈ విధానం ద్వారా మళ్లీ యాసంగిలో వరి ఆరుతడి పంటలను సకాలంలో సాగు చేసుకోవడానికి వీలవుతుంది. ఇక యాసంగిలో వరి సాగుకు స్వల్పకాలిక రకాలను ఎంచుకొని నవంబర్ 15 నుంచి 20వతేదీలోపు విత్తుకుంటే మార్చి నెలాఖరు నుంచి ఏప్రిల్ మొదట్లో పంట కోతకు వస్తుంది. తద్వారా వర్షాల నష్టం నుంచి మనం పంటను కాపాడుకోవచ్చు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని అంత్యక్రియలు పూర్తి

వట్‌పల్లి(అందోల్): బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యకు పాల్పడిన వడ్ల దీపిక అంత్యక్రియలు పూర్తయ్యాయి. స్వగ్రామం వట్‌పల్లి మండలం గొర్రెకల్ గ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. మంగళవారం దీపక మరణించిన విషయం తెలిసినప్పటి నుంచి విద్యార్థిని కడసారి చూపుకోసం గ్రామస్తులు ఎదురుచూస్తూ బుధవారం నిరీక్షించారు. నిర్మల్ ఆస్పత్రి నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు విద్యార్థి మృతదేహం చేరుకోవడంతో గ్రామస్తులు ఆమె ఇంటికి చేరుకున్నారు. విగతజీవిగా ఉన్న యువతిని చూసి బంధువులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో గ్రామం శోకసంద్రంలా మారిపోయింది. విద్యార్థి తండ్రి వీరన్న తన కూతురు మృతదేహాన్ని చూస్తూ బిడ్డ నీవు లేకుండా ఎట్లా బతకాలి అంటూ రోదించడం అక్కడున్న వారందరిని కంటతడి పెట్టించింది.



రోదిస్తున్న దీపిక తండ్రి, కుటుంబ సభ్యులు

బైక్ అదుపు తప్పి...

దుబ్బాకరూరల్: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం..రాజన్నసిరిసిల్లా జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన ఎండీ ఇర్ఫాన్(30) దుబ్బాకలోని తన బంధువులను కలిసేందుకు వస్తున్న క్రమంలో చీకోడ్ గ్రామంలోని పెట్రోల్ పంపు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి ఏదుల్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి మహిళ ..

రాయపోలు(దుబ్బాక): ద్విచక్రవాహనంపై నుంచి కింద పడి ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ చైతన్య కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన రామకృష్ణ తన భార్య నాగరాణి (25), కూతురు గిరిష్మను తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని చేగుంట మండలం కర్నాల పల్లికి మంగళవారం సాయంత్రం బయలు దేరారు. ఈ క్రమంలో దౌల్తాబాద్ మండలం సూరంపల్లి శివారులో ద్విచక్రవాహనం వెనుకాల కూర్చున్న నాగరాణి కింద పడి తీవ్ర గాయాలతో అక్కడే మృతి చెందింది. గమనించిన రామకృష్ణ బైక్ ఆపి చూసేసరికి తలకు తీవ్ర గాయాలై మృతిచెందినట్లు గుర్తించాడు.

వ్యక్తి అరెస్ట్

నర్సాపూర్: మహిళను వేధించిన కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని ఓ హాస్పిటల్ సమీపంలో కృష్ణ మోహన్ ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడం అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు.అనంతరం జైలుకు తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రాయపోలు(దుబ్బాక): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. రాయపోలు ఎస్‌ఐ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా దోర్నాల మండలం రామచంద్రకోట గ్రామానికి చెందిన దర్శనం జాను(32) గతేడాదిగా రాయపోలు మండలం రాంసాగర్‌కు వచ్చి భార్య పుష్పతో నివాసం ఉంటున్నాడు. తాపీమేస్త్రీగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి భార్యతో గొడవపడి జాను అదే రాత్రి దూలానికి చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సలహామేరకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



జాను మృతదేహం

వృద్ధురాలి గొంతుకోసి చంపిన నిందితురాలి అరెస్ట్

కేసును ఛేదించిన పోలీసులకు సీపీ అభినందనలు

సిద్దిపేటరూరల్: వృద్ధురాలి గొంతుకోసి చంపి బంగారు వస్తువులు దొంగిలించిన ఘటనలో నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిద్దిపేటరూరల్ సీఐ జానకిరామ్ రెడ్డి తెలిపారు. చిన్నకోడూరు ఎస్‌ఐ శివానందంతో కలిసి ఆ వివరాలు వెల్లడించారు. నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామానికి చెందిన బాలగొని లింగవ్వ(75) ఇంటి దగ్గర ఒంటరిగా ఉంటుంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు లింగవ్వ గొంతు కోసి చంపి బంగారు ఆభరణాలు అపహరించారు. ఈ ఘటనపై వృద్ధురాలి మేన కోడలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 7న చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సీఐ 3 బృందాలతో నిందితుల ఆచూకీ కోసం వెతికారు. కేసును అన్ని కోణాల్లో పరిశోధన చేసి టెక్నికల్ ఆధారాలతో కోహెడ మండలం శనిగారం గ్రామానికి చెందిన దయ్యాల సుజాతను నిందితురాలిగా గుర్తించారు. నిందితురాలిని విచారణ చేయగా తానే 7వ తేదీన చేపలు అమ్ముకుంటూ వెళ్లి లింగవ్వ ఇంట్లోకి చొరబడి హత్యచేసి మెడలోని బంగారం దొంగిలించినట్టు ఒప్పుకుంది. దీంతో నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని సీఐ తెలిపారు. సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, సీఐ జానకిరామిరెడ్డి, చిన్నకోడూరు ఎస్‌ఐ శివానందం, కానిస్టేబుళ్లు కమలాకర్ రెడ్డి, పరుశరాములు, శ్రీకాంత్‌లను కమిషనర్ శ్వేత అభినందించి రివార్డు అందజేశారు.




రివార్డు అందజేస్తున్న సీపీ శ్వేత

ముగ్గురి అదృశ్యం

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. మతిస్థితిమితం లేక ఒకరు, ఇంటి నుంచి వెళ్లిన ఇద్దరు మహిళలు కనిపించకుండా పోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పటాన్‌చెరు టౌన్: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమయ్యాడు. అమీన్ పూర్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్‌కు చెందిన ప్రభాకర్, అతడి సోదరుడు కరుణాకర్ రావు బతుకుదెరువు కోసం వచ్చి బీరంగూడ జయలక్ష్మి నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కరుణాకర్ రావుకు మతిస్థిమితం సరిగా లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ ఏడాది మార్చి 25వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో సోదరుడు ప్రభాకర్ తెలిసిన వారిని, బంధువులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. కరుణాకర్ రావు అదృశంపై అన్న ప్రభాకర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కరుణాకర్ (ఫైల్)

భార్య కనిపించడంలేదని..

పటాన్‌చెరు టౌన్: వివాహిత అదృశ్యమైన సంఘటన అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్ పూర్ పరిధి బీరంగూడ సాయి కాలనీకి చెందిన జయదేవ్ సచిన్ సింగ్ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఈ నెల 12వ తేదీన డ్యూటీకి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి భార్య గీతా సింగ్ కనిపించలేదు. దీంతో భార్య కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. భార్య అదృశ్యంపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూతురు కనిపించడం లేదని..

పటాన్‌చెరు టౌన్: కూతురు కనిపించడంలేదని పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. అమీన్ పూర్ మండల పరిధిలోని సుల్తాన్ పూర్ వెంకటేశ్వర కాలనీకి చెందిన హేమ తన కూతురు సరితను ఎనిమిదేళ్ల క్రితం వికారాబాద్ జిల్లా మొయినాబాద్ పెద్ద మంగళారం చెందిన గణేష్ తో వివాహం చేసింది. వీరికి ముగ్గురు సంతానం. ఇటీవలే పుట్టింటికి వచ్చిన సరిత ఈనెల 6వ తేదీన తలనొప్పిగా ఉందని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కూతురు అదృశ్యంపై తల్లి హేమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బైక్ ఢీ.. వ్యక్తికి గాయాలు

కొల్చారం(నర్సాపూర్): కారు బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయలైన సంఘటన మండల కేంద్రంలోని మెదక్-నర్సాపూర్ జాతీయ రహదారి చౌరస్తాపై బుధవారం చోటు చేసుకుంది. ప్రమాదానికి సంబంధించి ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. చిన్నఘన్‌పూర్ గ్రామానికి చెందిన చాకలి యాదగిరి తన బైక్‌పై పని నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడని తెలిపారు. ఇదే సమయంలో హైదరాబాద్ వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు, యాదగిరి బైక్ వెనక నుంచి ఢీ కొట్టిందన్నారు. దీంతో ఒక్కసారిగా బైక్‌తో పాటు యాదగిరి కొద్ది దూరంలో రహదారిపై ఎగిరిపడ్డట్లు తెలిపారు. ప్రమాదంలో యాదగిరి తలకు, ఇతర భాగాల్లో గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ తరలించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

శివ్వంపేట(నర్సాపూర్): సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ జరుగుతుందని రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి తూప్రాన్ డీఎస్పీ యదగిరిరెడ్డితో కలిసి మండల పరిధిలోని బిజ్లీపూర్‌లో సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, దాతల సహాయంతో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్‌ఐ రవికాంత్‌రావు, మండల కోఆప్షన్ మెంబర్ లాయక్, సర్పంచ్ చిట్యాల లక్ష్మి, ఉప సర్పంచ్ జహంగీర్ తదితరులు ఉన్నారు.

కారు-టిప్పర్ ఢీ

- నలుగురికి తీవ్ర గాయాలు, ఒకరి పరిస్థితి విషయం
- గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించిన సునీతారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మట్టి టిప్పర్ కారును ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నర్సాపూర్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై బుధవారం జరిగింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం...నర్సాపూర్‌కు చెందిన హరిభూషణమ్మ, ప్రకాశ్, నాగరాణి, అన్నపూర్ణ హైదరాబాద్ నుంచి నర్సాపూర్‌కు కారులో వెళుతున్నారు. ఇదే క్రమంలో నర్సాపూర్ నుంచి టిప్పర్ నల్లవల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై వేగంగా వస్తూ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి నర్సాపూర్ వెళుతున్నారు. ప్రమాదం జరగడం చూసి వెంటనే తన కాన్వాయ్ వాహనాల్లో గాయపడ్డ వారిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులతో మాట్లాడి గాయపడ్డ వారిని మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ప్రస్తుతం హరిభూషణమ్మ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. మట్టి టిప్పర్ వాహనాలతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విజయకృష్ణ తెలిపారు.



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్న సునీతారెడ్డి